మహాలక్ష్మీదేవీగా వాసవీమాత

◆ రూ.11లక్షలతో అమ్మవారికి అలంకరణ ◆ కనులపండువగా శ్రీనివాసకల్యాణం ◆ అమ్మవారికి దర్శించుకున్న ప్రభుత్వ విప్, గువ్వల బాలరాజు

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 18: దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాలక్ష్మి అమ్మవారికి రూ.11,11,116 నోట్లతో అమ్మవారిని అలంకరించినట్లు పేర్కొన్నారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం విద్యుద్దీపాల అలంకరణలో, వివిధ రకాల పుష్పాలతో, ఆలయ అర్చకుల మంత్రోచ్ఛారణతో కనుల పండువగా నిర్వహించినట్లు ఆలయ అధ్యక్షుడు తెలిపారు. భక్త మార్కండేయ శివాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు వనం పర్వతాలు తెలిపారు. అనంతరం మహిళలు ఆటా పాటలు, బతుకమ్మ, కోలాటం ఆడి కనువిందు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి బాల రాజు, కోశాధికారి కామిశెట్టి శ్రీనివాసులు, కర్ణస్వామి, నర్సిం హారావు, మిర్యాల విజయకుమార్, కటకం భాస్కర్, విసనకర్రల చంద్రకుమార్, బంధం విశ్వేశ్వర్‌నాథ్, ధన్‌రాజ్, రాములు, వేణు, నారాయణ, నర్సింహ, జగదీశ్వర్, నాగరాజు, పరమేశ్, రమేశ్, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొల్గాట్‌పల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



కూష్మాండమాతగా శ్రీశైల భ్రామరీ అమ్మవారు

వాసవీమాత ఆలయంలో రూ.11లక్షలతో అమ్మవారి అలంకారం

దుర్గామాతకు విప్ గువ్వల పూజలు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 18: మండలంలోని బొల్గాట్‌పల్లిలో మంగళవారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల రాజు దుర్గామాతను దర్శించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రతిఇంటికీ తీసుకెళ్లి బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేయలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనో హర్, సర్పంచ్ బిక్ని, నాయకులు పాల్గొన్నారు.

మహాంకాళీమాతగా..

అమ్రాబాద్ అక్టోబర్ 18: అమ్రాబాద్ పదర ఉమ్మడి మండలాల్లో దేవీ శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అమరేశ్వరాలయం, దండోరా కాలనీలోని దండోరా యూత్ ఆధ్వర్యంలో, పదర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను బుధవారం నిర్వాహకులు మహాంకాళీదేవీగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాలు మండపాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబురాలు అలరించాయి. సాయంకాలం కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, మహిళలు, భక్తులు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చండీదేవీగా దర్శనం

బల్మూరు, అక్టోబర్18: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగగా బుధవారం చండీదేవీగా అమ్మవారు నాలుగో రోజు భక్తులకు దర్శనమిచ్చారు. మండలం లోనిజినుకుంట, గోదల్, మహదేవ్‌పూర్, మంగళకుంటపల్లి, తుమ్మెన్‌పేట, కొండనాగుల, బల్మూరు, పోలిశెట్టిపల్లిలో అమ్మవారి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండపం వద్ద భక్తులు అన్నప్రసాద కార్యక్రమాలు చేశారు. రాత్రిళ్లు భక్తులు అఖండ భజనలు, కోలాటం వేస్తూ నృత్యాలు చేయడంతో పండుగ వాతావరణం నెలకొంటున్నది.

లింగాల మండలంలో..

లింగాల, అక్టోబర్ 18: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో దుర్గామాతకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం లోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మండపం వద్ద నాలుగో రోజు దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అవుసలికుంట, అంబట్‌పల్లిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూష్మాండమాతగా భ్రామరి

శ్రీశైలం, అక్టోబర్ 18: శ్రీశైలంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం భ్రమరాంబ దేవి సాత్విక రూపంలో భక్తులను అనుగ్రహించారు. సింహ వాహనాన్ని అధిష్ఠించి ఎనిమిది చేతుల్లో కుడివైపు పద్మం, బాణం, ధనస్సు, కమండలం, ఎడమవైపు చక్రం, గద,జపమాల, అమృతకళశాన్ని దాల్చి భక్తులకు దర్శనమిచ్చినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు.

నేడు స్కందమాతగా..

శరన్నవరాత్రుల్లో ఐదోరోజు గురువారం భ్రమరాంబా దేవి స్కందమాతా అలంకారంలోదర్శనమివ్వనున్నారని ఈవో పెద్దిరాజు తెలిపారు.

అమ్రాబాద్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కొండనాగులలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

లింగాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెండింగ్‌లో పనులను పూర్తి చేయాలి

◆ ఎంపీపీ లింగమ్మ

మాట్లాడుతున్న ఎంపీపీ లింగమ్మ

లింగాల, అక్టోబర్ 18: గ్రామాల్లో ఉన్న పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ లింగమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ వైద్యాధికారులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ తరచుగా వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, మన ఊరు-మనబడి పథకంలో చేపట్టిన పాఠశాల భవనాల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అంతకుముందు ఇటీవల మృతిచెందిన పీఆర్ డీఈ బాసునా యక్‌కు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీవో గీతాంజలి, ఏవో నాగార్జునరెడ్డి, ఆయా శాఖల ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 18: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ఉదయం 5:30గంటల నుంచి అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారని ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే భారీగా నగదు, మద్యం రాష్ట్రం లోకి రాకుండా శ్రీశైలం-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి గుండా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎవరూ పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

అమ్రాబాద్, అక్టోబర్ 18: తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలోని మన్ననూర్‌లో హైదరాబాద్-శ్రీశైలం హైవే చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేస్తున్నట్లు అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నందున వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎస్సైలు, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

లింగాల, అక్టోబర్ 18: మండలం లోని అవుసలికుంటలో ఏర్పాటు పోలింగ్ చేసిన కేంద్రాన్ని తాసీల్దార్ ఉమ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ.. నవంబర్ 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకుగానూ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. పరిశీలించిన పోలింగ్ కేంద్రాల నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సీతారాం, బీల్‌వోలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 18: ఉప్పునుంతల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.16వేల విలువైన బీరువాను పాఠశాలకు అందజేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కాశన్న, దామోదర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, మైనోద్దీన్, రవిశంకర్, ఇస్రత్‌బేగంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్ రెడ్డి, కాశన్న, రాఘవేందర్, శ్రీను, సుధాకర్, మల్లయ్య, సుమన్, సురేశ్‌రెడ్డి, మమత, స్వాతి, సైదమ్మ, సుప్రియ, నర్మద పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 18: పట్టణం లోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఉత్సాహంగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చిన తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కళాశాల ప్రాంగణంలో ఆటా పాటలతో పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థిని, విద్యార్థులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొని తెలంగాణలో ప్రతిష్టాత్మంగా నిర్వహించే బతుకమ్మ పండుగను ఉత్సాహంగా ఆటా పాటలతో కనువిందు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకుడు సైదులు, లైబ్రేరియన్ వసీయొద్దీన్, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్రాబాద్ మండలంలో..

అమ్రాబాద్, అక్టోబర్ 18: మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధా రాణి ఆధ్వర్యంలో విద్యార్థులు తీరొక్క పూలను తెచ్చి బతుకమ్మలను అలంకరించారు. ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, మందారం తదితర రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను బతుకమ్మలో పెట్టి ఆడుతూ పాడుతూ సంబురాలు నిర్వహించారు. ప్రకృతిని, పువ్వులను దేవుడిగా పూజించే గొప్ప సంప్రదాయం మన తెలంగాణకే సొంతమని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

అమ్రాబాద్‌లో సంబురాలు నిర్వహిస్తున్న అధ్యాకులు, విద్యార్థులు